క్లుప్తంగా

నేడు వైఖానస శాఖీయుల ఆత్మీయ సమ్మేళనం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో జిల్లాలోని వైఖానస శాఖీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ వైఖానస యూత్ ఫోరం గౌరవ అధ్యక్షుడు నరగిరినాథుని రాఘవాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనంలో వైఖానసుల సమస్యలు చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల వైఖానసులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : తెలంగాణ రాష్ట్ర బ్రహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అందించే సంక్షేమ పథకాలను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ బ్రహ్మణ పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంబొట్ల ఫణికుమార్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రహ్మణుల సంక్షేమం కోసం ప్రతి ఏడాది ప్రభుత్వం వంద కోట్ల బడ్జెట్ కేటాయిస్తుందన్నారు. 2023- 24 సంవత్సరానికి గాను వివేకానంద విదేశీ విద్యా పథకం, ఔత్సాహిక పారిశ్రామిక రంగం బెస్ట్ స్కీం పథకానికి శ్రీకారం చుట్టి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. ఆగస్టు 31వ తేదీ లోపు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న పూజారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి మాట్లాడుతూ ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు భగవద్గీత పారాయణం ఉంటుందని తెలిపారు. అర్చకులు ఎన్.నరసింహాచార్యులు, స్థానాచార్యులు ఎం.దామోదరాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగాల : మండలంలోని ఆకుపాముల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల వ్యవసాయ, ఎత్తిపోతల, విజయ ఆగ్రో ఫీడర్లకు ఆదివారం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వికాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రక్తదానం

హుజూర్‌నగర్ : రక్తదానంతో ఆపదలో ఉన్న మనిషి ప్రాణాలు కాపాడొచ్చని జనచైతన్య ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పి.శివశంకర్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాబుకు ఏ పాజిటివ్ రక్తం కావాలని ట్రస్ట్ వారిని అడగడంతో స్పందించి రక్తదాత కిషోర్‌తో రక్తం ఇప్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు వంశీ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ పరమేష్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్‌ను శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బట్టు మధు, సత్యనారాయణరెడ్డి, రామస్వామి, కొణతం సీతారాంరెడ్డి, కందిబండ శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, సైదులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాలలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలను ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కొండా సూర్యం, ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ రామారావు, ప్రధాన కార్యదర్శిగా నాగరపు మురళి, కార్యదర్శులుగా పుల్లూరి బాబు, అమరబోయిన గురునాథం ప్రచార కార్యదర్శులుగా నాగరాజు, నరసింహారావులను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ అధ్యక్షుడిగా గురుప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రాజా, ప్రధాన కార్యదర్శిగా కలకొండ నాగరాజులను ఎన్నుకున్నారు.

జోరుగా వరినాట్లు

- బోర్లు, బావుల కింద 4000 ఎకరాల్లో పూర్తి
- పెరిగిన భూగర్భజలాలు, 24 గంటల విద్యుత్‌తో ఆనందంలో రైతులు



మునగాలలో బోరు కింద నాట్లు వేస్తున్న కూలీలు

మునగాల : మండలంలో బోర్లు, బావుల కింద ఖరీఫ్ సీజన్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో బోర్లు పుష్కలంగా పోస్తుండంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి సీజన్‌లో మండలవ్యాప్తంగా 20,800 ఎకరాల్లో వరి సాగుచేస్తుంటారు. సాగర్ ఆయకట్టు, ఎత్తిపోతల పథకాల కింద లో 8,500 ఎకరాలు, బోర్లు, బావులు, చెరువులు, కుంటల కింద 12,300ఎకరాలు సాగు చేస్తుంటారు. మండల వ్యాప్తంగా గత వారం రోజుల వ్యవధిలో 4000 వేల ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు. గత పక్షం రోజుల క్రితం వరకు వర్షాలు లేకపోవడంతో ఆందోళనకు గురైన రైతాంగం ప్రస్తుతం సాగు కోసం ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. సాగర్ ఎడమకాలువకు సాగునీరు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీల సైతం దొరకుతుండటంతో నాట్లు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ కూడా అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలో ఎత్తిపోతల పథకాలు, సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతాంగం సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు.

బోర్లు పుష్కలంగా పోస్తున్నాయి



మునగాలలో నాకు 13 ఎకరాల భూమి ఉంది. దీనికి తోడు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాను. ప్రస్తుతం బోర్ల కింద ఐదు ఎకరాలలో నాట్లు వేశాను. మిగతా భూమికి సాగర్ నీరు అందితేనే నాట్లు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం బోర్లు బాగా పోస్తున్నాయి.

– తూముల వీరస్వామి, రైతు, మునగాల

మూడు ఎకరాల్లో నాట్లు వేశాను



బరాఖత్‌గూడెంలో నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో బోరు కింద ఉన్న మూడు ఎకరాలలో మూడు రోజుల క్రితమే నాట్లు వేశాను. మిగతా మూడు ఎకరాలకు సాగర్ నీరు రావాలి. సాగర్ నీటి కోసం ఎదురు చూస్తున్నాను.

– మోహన్‌రెడ్డి, రైతు, బరాఖత్‌గూడెం

30 శాతం పూర్తయ్యాయి



వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలకు వరదనీరు వచ్చి చేరింది. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగాయి. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు బోర్లు, బావుల కింద 30 శాతం నాట్లు వేశారు. మరో వారంలో బోర్లు, బావుల కింద పూర్తవుతాయి.

– బి. అనిల్‌కుమార్, ఏఓ, మునగాల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అమరవరం–అంజలిపురం గ్రామాల మధ్య రహదారిపై రూ.96 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో పంటపొలాలకు వెళ్లే రహదారుల్లో 7 వంతెనలు మంజూరు చేయించినట్లు తెలిపారు. 4 నెలల్లో వంతెనల పనులు పూర్తి చేసి రైతులు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ గుజ్జుల సుజాత, పీఏసీఎస్ చైర్మన్ అన్నెం శౌరిరెడ్డి, ఉపసర్పంచ్ బాలసైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు పోటీపడాలి

హుజూర్‌నగర్ : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు పోటీ పడాలని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో గత మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులపై ముద్రించిన డోర్ స్టిక్కర్లు, కరపత్రాలను శనివారం ఆయన పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సర్పంచ్ జ్యోతి రామారావు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

సౌదీ నుంచి వచ్చిన మిర్యాలగూడెం వాసి ఎండీ అబ్బాస్ ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు.

ఎమ్మెల్యే సైదిరెడ్డి పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామ సర్పంచ్ కుక్కడపు జ్యోతి మామ మాజీ ఎంపీటీసీ కుక్కడపు గురువయ్య తండ్రి కుక్కడపు రామయ్య ఇటీవల మృతి చెందాడు. శనివారం ఎమ్మెల్యే సైదిరెడ్డి.. రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, సర్పంచ్‌లు సుధీర్, శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ రాములునాయక్, మాజీ సర్పంచ్ శ్రీహరి, సైదులు, మట్టపల్లి, వీరస్వామి, బాలస్వామి ఉన్నారు.

సందేశాత్మక చిత్రాలను ఆదరించాలి



స్లమ్‌డాగ్ హస్బెండ్ చిత్రం ప్రారంభం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చిత్ర నిర్మాత బంధువులు

కోదాడఅర్బన్ : ప్రజా ప్రయోజనార్థం నిర్మించే సందేశాత్మక చిత్రాలను ఆదరించాలని అప్పిరెడ్డి యువసేన నాయకులు ఉప్పునూరి వెంకటరెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో అన్నపురెడ్డి అప్పిరెడ్డి, వెంకటరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన స్లమ్‌డాగ్ హస్బెండ్ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ పట్టణానికి చెందిన అప్పిరెడ్డి, వెంకటరెడ్డి బ్రదర్స్ మంచి సినిమాలు తీస్తూ ప్రజాదరణ పొందడం అభినందనీయమన్నారు. ముందుగా అప్పిరెడ్డి యువసేన ఆధ్వర్యంలో స్థానిక ఖమ్మం క్రాస్‌రోడ్డు నుంచి వెంకటేశ్వర థియేటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కత్రం వీరారెడ్డి, తుమాటి నాగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, షరీఫ్, నరేష్, అప్పిరెడ్డి యువసేన నాయకులు గుండు సతీష్, విజయ్, జెట్టి వెంకటతేజ, మాదాసు గోపి, నూకతోటి సైదులు, సాయి, బ్రహ్మం, పవన్, రాకేష్ పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



కనకదుర్గ ఆలయంలో చోరీకి గురైన హుండీ



బ్రహ్మంగారి ఆలయంలో చోరీకి గురైన హుండీ

మునగాల(కోదాడ): గుర్తుతెలియని వ్యక్తులు మునగాల మండల కేంద్రంలోని సీఐ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. మునగాలలో నిత్యం రద్దీగా ఉండే గణపవరం క్రాస్‌రోడ్డు సమీపంలో పక్కపక్కనే ఉన్న శ్రీవెంకట్ కనకదుర్గ దేవాలయంతో పాటు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయల్లో దుండగులు హుండీలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని ఆలయ కమిటీలు తెలిపాయి. శ్రీకనకదుర్గ దేవాలయం గోడ దూకి లోనికి ప్రవేశించిన దుండగులు లైట్లు ఆర్పేసి హుండీని పగులగొట్టినట్లు తెలిసింది. కనకదుర్గ దేవాలయం వెనుక వైపున ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు హుండీని గుడి వెనకకు తీసుకువెళ్లి పగులగొట్టి చోరీ చేసినట్లు ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. శనివారం ఉదయం పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు ఈ చోరీ విషయాన్ని ఆయా దేవాలయ కమిటీకి తెలపడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్‌ను వివరణ కోరగా హుండీలు పగులగొట్టినట్లు దేవాలయ కమిటీ తెలపడంతో తాము వెళ్లి పరిశీలించామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



నర్సింహులగూడెంలో ఓ భవనంపై చేతికి అందే విధంగా ఉన్న విద్యుత్ తీగలు

మునగాల: విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మునగాల మండలం నర్సింహులగూడెంలో శనివారం చోటు చేసుకుంది. నర్సింహులగూడెం గ్రామానికి చెందిన ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమారుడు ఆదిరారెడ్డి ఆడుకునేందుకు భవనం పైకి ఎక్కాడు. ఈ క్రమంలో భవనంపై వేలాడుతూ చేతికి అందే విధంగా ఉన్న తీగలు బాలుడికి తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణం తరలించారు. కాగా, నర్సింహులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఓ భవనంపై విద్యుత్ తీగలు చేతికి అందేవిధంగా ఉన్నప్పటికీ సంబంధిత శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి ఆరోపించారు. తక్షణమే విద్యుత్ తీగలను తొలగించాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో ఘనంగా మొహర్రం వేడుకలు



మేళ్లచెరువు : రేవూరులో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నలో..



హుజూర్‌నగర్‌లో పీర్ల చావిడిలో గంధం సమర్పిస్తున్న ఓజో చైర్మన్ పిల్లుట్ల రఘు



మునగాల : బరాఖత్‌గూడెంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు పాల్గొని గంధం సమర్పించారు. అనంతరం పీర్ల చావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ముజావర్ షేక్ సైదా, నాగులు మీర, సైదా, ఓజో ఫౌండేషన్ ఇన్‌చార్జ్, సభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

పట్టణంలోని పీర్ల చావిడి వద్ద నిర్వహించిన పీర్ల పండుగ (మొహర్రం) వేడుకల్లో శనివారం రాత్రి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పీర్ల ముజావర్లు, కౌన్సిలర్ ఎం.రామ్ గోపి, శ్రావణ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో పీర్లను గ్రామంలో ఊరేగించారు. హిందువులు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని మాధవరం, నర్సింహులగూడెం, ముకుందాపురం, బరాఖత్‌గూడెంతో పాటు తదితర గ్రామాలలో మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా అగ్ని గుండం చుట్టూ తిరుగుతూ పాటలు పడుతూ ఆడారు. పీర్లను ఊరేగింపుగా చెరువులు, బావుల వద్దకు తీసుకెళ్లి శాంతింపచేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పీర్లకు కుడకలు, దట్టీలు సమర్పించారు. కార్యక్రమంలో ముజావర్ లాల్ మహ్మద్, దస్తగిరి, పాషా, కలాం, యూసఫ్ పాషా, భిక్షం, ఖాసీం, సలీం, జానీ, అన్వర్ ముస్లింలు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంతో పాటు రఘునాథపాలెం, పెదవీడు తదితర గ్రామాలలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వంచారు. కులమతాలకతీతంగా పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు, ఉపసర్పంచ్ శాంతినరసింహారెడ్డి, ఎల్లావుల నాగయ్యయాదవ్, బాలనాగయ్య, ముస్లిం లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో శనివారం మొహర్రం పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు కుతుబ్‌షాపురం, గానుగుబండ తదితర గ్రామాలలో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముజావర్లు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నలో శనివారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వేడుకల్లో పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలో మొహర్రం పర్వదిన వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పీర్లను ఊరేగించారు. ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్‌కె.ఖలీల్, జలీల్ అహ్మద్, గులాం, రఫీ, జాన్‌షరీఫ్, సయ్యద్ అనీఫ్, మీర్జా నజీర్, తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి : యాతవాకిళ్లలో..



గరిడేపల్లిలో..



నడిగూడెం : రాజావారి కోటలో..



చిలుకూరులో..

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య బృందం

మఠంపల్లి : వర్షాలకు గ్రామాలు, గిరిజన తండాలలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలలో భాగంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ తెలిపారు. శనివారం కృష్ణాతండాలో మెడికల్ క్యాంపును ప్రారంభిం చి మాట్లాడారు. సుమారు 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. సర్పంచ్ ముడావత్‌పార్వతీ, రామారావునాయక్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పులిచింతలకు తగ్గిన ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో కొంత తగ్గింది. శుక్రవారం 56, 227 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి 11,949 క్యూసెక్కులుగా నమోదైంది. జిల్లాలో గత రెండు రోజులుగా వర్షం తగ్గుముఖం పట్టడంతో కృష్ణానదిలో వరద ఉధృతి తగ్గింది. దీంతో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 30.78 టీఎంసీల నీరు ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా ప్రస్తుతం 164 అడుగుల నీరు ఉంది. లీకేజీల ద్వారా 200 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది.

కూలిన ఇంటి ప్రహరీ

హుజూర్‌నగర్‌రూరల్ : గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కరక్కాయలగూడెంలో పార్ధనబోయిన వీరయ్యకు చెందిన ఇంటి పాత గోడ శుక్రవారం రాత్రి కూలింది. వీరయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు అంకతి వెంకటేశ్వరరావు, ప్రశాంత్, వెంకటేశ్వర్లు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం మండలంలోని కీతవారిగూడెం వద్ద చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కీతవారిగూడెం గ్రామానికి చెందిన తంగేళ్లపల్లి వెంకటేశ్వర్లు గ్రామంలో పని నిమిత్తం బైక్‌పై బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ అతని బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు కుమారుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నడిగూడెంలో గంజాయి కలకలం!

నడిగూడెం : మండల కేంద్రంలో గంజాయి కలకలం రేపుతోందతి. రామాలయం ఎదుట గల ప్రాథమిక పాఠశాలలో రాత్రి వేళల్లో యువత గంజాయి సేవిస్తున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో చర్చనీయాంశంగా మారింది. గంజాయి సేవిస్తున్న వారిలో పలువురి రాజకీయ నాయకుల కుమారులు ఉన్నట్లు సమాచారం. పోలీసులు స్పందించి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ ఏడుకొండలు సంప్రదించగా గ్రామాలను నిత్యం పర్యవేక్షిస్తున్నామని, గంజాయి సేవిస్తున్నట్లు ఎవరైనా సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



శ్రీనివాస థియేటర్ ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



డాక్టర్ శ్రీనివాసరెడ్డి వీధి వద్ద..

- తక్కువ ఎత్తులో నిర్మాణం
- రక్షణ వలయాలు కరువు
- భయాందోళన చెందుతున్న ప్రజలు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ వలయాలే లేవు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయినా ప్రజలకు రక్షణ కల్పించేందుకు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా ప్రధాన రహదారిపై ట్రాన్స్‌ఫార్మర్, అదే రహదారిపై డాక్టర్ శ్రీనివాసరెడ్డి వీధి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వలయాలే కరువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదపు అంచున ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు పెన్సింగ్ వేయించాలని, కిందకు ఉన్న వాటిని ఎత్తుపై పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం



కోదాడరూరల్: జీపీ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సాముల జైపాల్‌రెడ్డి

కోదాడరూరల్ : గత 24 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని సాముల జైపాల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సాముల జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జీపీ కార్మికుల కనీస డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సమ్మెలో ఉన్న కార్మికులను పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, కొప్పుల కోటిరెడ్డి, ముత్తయ్య, రామారావు, లింగయ్య, కరీం, కొండలు, బాబు తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం 24వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు యాకుబ్ సమ్మెనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయలని చూస్తే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పుతారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపగాని సత్యం, రమేష్, నర్సిరెడ్డి, వెంకన్న, ఇషాక్, జానయ్య, శ్రీను, నాగమణి తదితరులు ఉన్నారు.

నడిగూడెం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. చిమట నాగరాజు, శ్రీకాంత్, వెంకన్న, రమేష్, యేసు, రామకృష్ణ పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ ఎదుట పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె శనివారం 24వ రోజు కొనసాగింది. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రసీమియా, పంచాయతీ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం.మైసయ్య, మోతీలాల్, పిచ్చయ్య, నరసింహారెడ్డి, దేవదానం, వెంకటేశ్వర్లు, రహీం, వెంకటి పాల్గొన్నారు.

కేసీఆర్ తాతా మా నాన్నను రెగ్యులరైజ్ చేయవా..



తండ్రికి మద్దతుగా సమ్మెలో కూర్చున్న చిన్నారి

చిలుకూరు : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేసున్న సమ్మె శనివారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పోలేనిగూడెం జీపీ కార్మికుడి కుమారుడు తండ్రితో పాటు సమ్మెలో కూర్చొని కేసీఆర్ తాతయ్య మా నాన్నకు జీతం పెంచి పర్మినెంట్ చేయావా అని రాసిన ప్లకార్డు ప్రదర్శించాడు. కార్యక్రమంలో జీపీ సంఘం అధ్యక్షుడు కట్టెకోల శ్రీనివాస్‌రావు, జీపీ కార్మికులు తిరగమళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటి, షేక్ జాకీర్‌హుస్సేన్, వడ్రాణపు తిరపయ్య, పట్టపాక నాగేశ్వరరావు, దానియా, సైదయ్య, నాగేంద్రబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.